వెంకటేశ్వర ప్రొడక్షన్స్ వారి
సతీసుకన్య
దర్శకత్వం. చంద్రమోహన్.
KRISHNA.

కథ:- అయోధ్యా నగరాన్ని రాజధానిగా చేసుకొని భారతదేశాన్ని సుభిక్షంగా పాలించిన సూర్యవంశ శిరోమణి, శర్యాతి ప్రభువుల ఏకైక పుత్రిక సుకన్య-కాత్యాయనీదేవి వరప్రసాదిని; అందాల భరిణె; సుగుణాల రాశి. ఒకనాడామె చెలికత్తెల్తో సరయూనదీ తీరానికి వనవిహారానికి వెళ్ళింది. ప్రకృతి సౌందర్యానికి ముగ్ధురాలై ఆడుతూ పాడుతూ అడవుల్లో విహరిస్తున్న ఆమెకు ఓ పెద్ద పుట్ట కన్పించింది. పుట్టకలుగుల్లో రెండుజ్యోతులు వెలుగుతున్నాయి. వాటి నామె మిణుగురు పురుగులని భ్రమించి, దర్భపుల్లతో పొడిచింది. బాధతో కూడిన నిట్టూర్పు విన్పించి జ్యోతులు ఆరిపోయినవి. ప్రళయమా అన్నట్లు ప్రకృతి వికృతరూపం దాల్చింది. అయోధ్యానగరం అరిష్టాల పాలైంది. ప్రజలు, పరిజనులు, వైద్యులుసైతం నివారించలేని యేదో తెలియని వ్యాధికి వశులై బాధపడ సాగారు. విషయాన్ని విని రాజదంపతులు విచారంతో తల్లడిల్లారు. సమయాని కేతెంచిన నారదమునీంద్రులవలన, తమ కుమార్తె బాల్య చాపల్యంచే తపోనిష్టలో వున్న చ్యవన మహర్షులకు తీరని అపచారం జరిగిందనీ, ఆ కారణంగా మాని అంధుడయ్యాడనీ తెలుసుకొని వ్యథిత హృదయాలతో అడవికి బయలుదేరి వెళ్ళారు రాజదంపతులు; తమకుమార్తె తప్పిదాన్ని మన్నించి తమను, తమప్రజలను రక్షించవలసిందని పుట్టనుండి వెలువడిన చ్యవనుని ప్రార్థించారు.

తన కేమీ తెలియదని, తనకు జరిగిన అన్యాయానికి దైవమే కినిసి లోకాన్ని శపించాడేమోనని తెలిపాడు మహర్షి. అంధత్వంతో అడవుల్లో బాధపడటం దేనికని, నగరుకు యేతెంచి, తమ సేవల్ని స్వీకరించ వలసిందని మానిని వేడుకున్నాడు మహారాజు. తనకు సుఖ జీవితంపై ఆసక్తి లేదని, ప్రశాంతమైన వనమే తన తపోనిష్టకు అనువైన ప్రదేశమంటూ ఆహ్వా

నాన్ని తిరస్కరించాడు మహర్షి. ఇంతలో నారదుడు ఆ ప్రదేశంలో ప్రత్యక్షమై, సుగుణ రాశియైన కన్యను తెచ్చి మానికి వివాహం చేయవలసిందనీ, ఫలితంగా అరిష్టాలు తొలగి శుభ మివ్వగలదని మహారాజుకు సలహాయిచ్చాడు. తను చేసిన నేరానికి అమాయికమైన మరో యువతి జీవితాన్ని బలియివ్వటం అన్యాయమని, తను మనస్ఫూర్తిగా మునిని వివాహం చేసు కోవటానికి సిద్ధంగా వున్నానని సుకన్య తన నిశ్చయాన్ని తెల్పింది. రాజదంపతులు సందిగ్ధంలో పడ్డారు. ఓవైపు కన్నప్రేమ – మరోవైపు న్యాయపాలన... మహారాజు కుమార్తెనిర్ణయాన్ని మార్చలేక పోయాడు. శత వృద్ధుడు, అంధుడూ అయిన మునికి– నవయవ్వనవతి, జగదేక సుందరి అయిన సుకన్యకు వనంలో వివాహం జరిగింది సుకన్య తను రాజకుమార్తెనని మరచి జీవితాన్ని పతిసేవకే అంకితంచేసి మహాసాధ్వి అని కొనియాడబడింది.

సూర్యపుత్రులైన అశ్వినీకుమారులు హవిస్సుకు అనర్హులంటూ, దేవేంద్రుడు సభా మధ్యంలో వారిని అవమానించాడు. ఆ కారణంగా అశ్వినులు తాము హవిస్సును పొందిగాని సభలో ప్రవేశించమని ప్రతినచేసి నిష్క్రమించారు. దేవేంద్ర పరాభవాన్ని కాంక్షించిన నారదమహర్షి చ్యవనుడే వారికి తగిన సహాయం చేయగలవాడని చెప్పి, అశ్వినులకు ఆశ్రమ మార్గం చూపాడు. దేవవైద్యులైన అశ్వినులు చ్యవనాశ్రమం చేరుకున్నారు. సుకన్య సౌశీ ల్యాన్ని మెచ్చుకొని, చ్యవనమహర్షికి దృష్టితోపాటు రూపాన్ని, యవ్వనాన్ని, ప్రసాదించారు.

నారదునివలన విషయం విని, దేవేంద్రుడు మండిపడ్డాడు. దేవతాయోగ్యమైన సిద్ధౌషధాన్ని నరులకు ప్రసాదించిన అయోగ్యులంటూ అశ్వినులను గార్ధభాలుగా శపించాడు.

కాని సుకన్య తన పాతివ్రత్య మహిమచే వారికి నిజరూపాల్ని ప్రసాదించింది. దేవేంద్రుడు ఉగ్రుడయ్యాడు. కామరూపవిద్యాప్రవీణుడైన విద్యాధరుని పిలిచి, చ్యవన దంపతులను పరాభవించ వలసిందిగా ఆజ్ఞాపించాడు. కారణంగా నవయవ్వనంలో వున్న చ్యవనుని లోకం గుర్తించలేక పోయింది. కామాతిశయంతో పరపురుషుని వలలో చిక్కుకొని, వృద్ధుడు, అంధుడు అయిన పతిని హత్యచేసిందన్న నేరం సుకన్యపై బడింది. మహారాజు ఆమెను విచారించి శిక్ష విధించాడు. అగ్నిప్రవేశానికి యేర్పాట్లు జరిగాయి. సుకన్య అగ్నిలో ప్రవేశించింది. కాని అగ్ని చల్లారి పూల సెజ్జగా మారింది. అదంతా మాయ, మంత్రమంటూ లోకం అవహేళనచేసింది. మహారాజు అయోమయానికి గురయ్యాడు కాని నారదుని ఆదేశానుసారం యదార్థాన్ని లోకానికి వెల్లడించటంకోసం అశ్వినుల ప్రీతికై పుత్రకామేష్టియాగం తలపెట్టాడు.

తన విరోధులైన అశ్వినీ కుమారుల మెప్పుకోసం ప్రారంభంగాబోతున్న యాగాన్ని భగ్నం చేయటానికే సంకల్పించాడు దేవేంద్రుడు. అగ్నిని పిలచి హోమాగ్నిని రగుల్చవలదని శాసించాడు కాని సతీత్వ ప్రభావంవలన అగ్ని మంత్రబద్ధుడయ్యాడు. దేవేంద్రుడు ప్రళయ రుద్రుడయ్యాడు. బృహస్పతి వారిస్తున్నా వినక యాగ విధ్వంసనకు స్వయంగా బయలుదేరాడు ఓ వైపు పాతివ్రత్య మహిమ; మరోవైపు ముల్లోకాధిపతియైన దేవేంద్రుడు...? యాగం యేమైంది? అశ్వినులు హవిస్సును పొందగల్గారా? సాధ్వి సుకన్యపై బడిన అపవాదు తొలగిందా? ... తక్కిన కథ వెండి తెరపై చూడండి.

———

★ పాటలు ★

1. సుకన్య, చెలికత్తెలు — శ్రీమతి లీల పార్టీ

జీవితమే మనోహరమే
జాజిసుమాల పరిమళమే ॥జీ॥

ఈ వనమును, తపోవనమును, కనేములే।
జీవితమున సుధాకరమును పొందేములే।
ఆమని శోభ హాయిగనే,
నామది గీతి పాడెనులే,
ఆటల పాటల తేలుదమే ॥జీ॥

మది వలచెను, నదీజలముల ఆడేములే,
ముదమెగయగ, మనోవాంఛలు, ఈడేరులే,
ఆమని శోభ హాయిగనే,
నామది గీతి పాడెనులే,
ఆటల పాటల తేలుదమే ॥జీ॥

2. సుకన్య — శ్రీమతి లీల

అందాల సొగసులు చిందెనే,
కనువిందేనే, మదిపొంగేనే ఔనే ॥అం॥

మల్లె మాలతులు విరిసెనే యీవని,
మాధవి మైమరచి నాట్యమాడె తానని,
కోయిల పాటలు, మయూరాల ఆటలు
హాయి మది, హాయి భలే, హాయిహాయి
హాయిలే ॥అం॥

కమ్మని విరజాజుల పిల్లగాలి వీచెనే,
వన్నెలేడిపిల్లల నయనాలు బెదరిపోయెనే,
పూవుల మాలలా, పసందైన ఊయల,
హాయి మది, హాయి భలే, హాయిహాయి
హాయిలే ॥అం॥

3. మాయ (నృత్యం) — జమునారాణి

సోమపానం, ఈ దివ్యగానం
సురలోకవాసుల సొమ్మేకదా ॥
వేదాల రవళిని, లోకాలు సలిపిన
యాగాల ఫలమిది ఈ సోమమే,
సురనాథులకు వరదానముకై
నరులొసగిన ప్రియమగు నైవేద్యమే- ॥సోమపానం॥

రాగాల పిలుపుల, భోగాల వలపుల
శృంగార మొలికించు నా గానమే,-
కమనీయముగ రమణీయముగ
మృదుమనసుల రంజిల అందింతుగా- ॥సోమపానం॥

4. నారద — శ్రీ ఘంటసాల

జయ జయ లోకావనా
భవభయ హరణా - కరుణాభరణా
జయ జయ లోకావనా ॥

పావన చరణా - శోభితనయనా
దురిత నివారణ సకలకారణా
ధర్మపరాయణ నారాయణ ॥జయ॥

నిరుపమ, నిర్మల మధురాకారా,
నిరుపమాన సుగుణాలయ శౌరీ,
నిత్యనిరామయ నారాయణ... ॥జయ॥

5. సుకన్య, చ్యవన (డ్యూయెట్) ఘంటసాల, & పి. లీల

నేడే హాయి హాయి।
ఆనందము చిందేరేయి॥

సు॥ ఆశలన్ని మోసులేసి తనువే పండెగా।
చ్య॥ మానసమున మోహమేదో మధువే చిందెగా,
సు॥ రాగముల, అనురాగముల నవరాగాల లీలా।
చ్య॥ రంజిలె నాహృది గానాల తేలా — నేడే।
సు॥ అందమైన చందమామ పొంచీ చూచెనే।

చ్య॥ అందాల రాణి నీవేయని చెంతా చేరెనే।

సు॥ హాసములా పరిహాసములా దరహాసాలి వేలా

చ్య॥ లాస్యముతో మది దోచావె బేలా ॥నేడే॥

6. సుకన్య, చ్యవన (డ్యూయెట్) ఘంటసాల & పి. లీల

మధురమైన రేయి,

మరిరాదు యిదేహాయి ...॥

సు॥ అలల తేలి, కలలసోలి, వలపు నేక సాగెలే।

చ్య॥ తలపులోన తేనెలొలుక బ్రతుకు

స్వర్గమాయెలే॥

ఇద్దరూ॥ మధురమైనరేయి ...॥

7. సుకన్య పి. లీల

సు॥ హే జగన్మాతా - కరుణా సమేతా॥

నిరతము నిన్నే నమ్మితినమ్మా,

నోములు వ్రతములు చేసితినమ్మా

నమ్మిన నా కీ గతి యేలనమ్మా ॥హే॥

సాకీ॥ పతియె దైవమని నమ్మిపొందిన వరాలఫలమా

నా సతీత్వమునకే అవమానమా - ఇది

న్యాయమా -

అన్నము పున్నము యెరుగని దానను

కన్నతండ్రియే అనుమానించెను

మన్నన చేసీ కావగరావే ॥హే॥

★ పద్యాలు ★

సుకన్య (పద్యం) — పి. లీల

ఓ కాత్యాయని ఓమదంబ జననీ
ఓ భక్తమందార మా
ఆకారంబులు మూడు నొక్కటియునై
యాందోళనంబయ్యెడిన్,
నా కాంతు న్వెస జూపవే కరుణ, ధన్యం
బౌను జన్మంబు, త
ల్లీ కాపాడవే దీనురాలి జయ కాళీ రాజ
రాజేశ్వరీ. 1

దాన జపాగ్ని హోత్ర పరతంత్రుడు
భర్తను గొంటినేని, నీ
ధ్యానమె నాకు జీవమని గౌరిని
వేడుక గొల్తునేని, నా
మానసమందు నిన్ను జపియించి,
నుతించుచు నుంటినేని,
సానల పట్టకుండ యిక సాగి
వెలుంగుము హవ్యవాహనా. 2

పతిపద సేవతక్క యితరమ్మగు
లోకము నే నెరుంగ, నే
పతియె సమస్తమంచు మది దలచి
సపర్యల చేయుచుంటి, నే
డతులిత నింద పైబడియె,
నక్కట, దుర్విధి, వీతిహోత్ర! నా

వెతలనుబాపి ఆ చ్యవనునే
పతిచేయుము జన్మజన్మలన్. 3

అమృత కలశ హస్తుడైన ధన్వంతరి
యజ్ఞ భాగమం దర్హుడైన
నిఖిల వైద్యశాస్త్ర నిపుణులే వేల్పులు
అర్హులెట్లుగారో అమరనాథ ! 4

ఇచ్ఛాజ్ఞాన సమస్తశక్తి సహితే,
ఇందీవర శ్యామలే
ఇంద్రోపేంద్ర వరప్రదే, ఇభవనాధీశే,
ఇనారాధితే,
ఇజ్ఞే, ఇందునిభాననే, ఇభనుతే,
ఇష్టార్థ సిద్ధిప్రదే,
ఇంద్రాణీనమితే, ఇభాననను తే,
వందే అఖిలాండేశ్వరీ. 5

కోటి దేవేంద్రు లేకమై కూడదన్న
యజ్ఞమును మానువారమే అసురవైరి
అశ్వనులకందు భాగంబు నమరజేసి
ప్రతిన నెరవేర్చుకొందుము ప్రజ్ఞతోడ. 6

ఘోరంబై చటులాగ్ర
భీకరంబున్ క్రోధాగ్నులన్ చల్లగన్
క్రూరాత్ముం డసురారి మత్పతిని
నిర్మూలంబు గావింప
దుర్వారంబౌ కులిశంబు
పోవిడిచె నీదె భారంబు, ఉమా,
గౌరీ, శ్రీపరమేశ్వరీ కరుణ
మాంగల్యంబు రక్షింపవే. 7

దేవేంద్రుడు (పద్యాలు) —మాధవపెద్ది సత్యం

సోమవిభాగమందు
హయసూనుల కర్హతలేదుగాన ఈ

హోమము మానుడింక
వనజోద్భవుడైనను మీరజాల డీ
నీమము భామరో దలక నేర్తురె
దేవగణంబుతోడ మీ
రీమెయి యజ్ఞధర్మముల
1 నెంచరయేని సహించువాడనే.

తాపసవృత్తి సౌఖ్యముల
దంపతులిర్వురు నాశ్రమంబులో
కాపురముండ కీగతి
యకారణవైరము బూననేటికో
మాపయి, అశ్వనీసుతుల
మాటలునమ్మి వివేకసూన్యుడో
నీపతి, స్వర్గనాథుని గణింపడో,
ధర్మము లభ్యసింపడో ॥ 2

చూచెదగాక ఏకరణి
సోమము నశ్వనుల కీయబూని
నీచులు మానవాధములు
నిల్వగలరో మదీయధాటికిన్
చూచెదగాక మత్కులిశ
చోదితకీలల నెట్లుసైతురో
బ్రోచెడువా డెవండో
భృగుపుత్రుని నేడు జగత్రయంబులో ॥ 3

నటీనటులు

కుమారి కృష్ణకుమారి	....	సుకన్య
శ్రీమతి అమ్మాజీ	....	చిత్ర
శ్రీమతి మీనాకుమారి	....	చంద్ర
శ్రీమతి రమాదేవి	....	మహారాణి
శ్రీమతి రజని	....	శచీదేవి
శ్రీ అమరనాథ్	....	చ్యవనమహర్షి
శ్రీ కాంతారావు	....	అశ్వనీకుమారులు
శ్రీ రమణారెడి	....	మార్గాన్వేషి
శ్రీ మిక్కిలినేని	....	శర్యాతి మహారాజు
శ్రీ రాజనాల	....	దేవేంద్రుడు
శ్రీ పద్మనాభం	....	నారదమునీంద్రుడు
శ్రీకాంత్	....	విష్ణు
శ్రీ యన్. అర్. శర్మ	....	ధర్మాధికారి

బేబీ చంద్రకళ, బేబీ పూర్ణిమ, మాస్టర్ రాజేంద్ర, మాస్టర్ సంగ్రామసింగ్, మాస్టర్ సంపత్, శ్రీమతి జయ.

గెస్టు నటీనటులు: శ్రీమతి ప్రతిమాదేవి, శ్రీమతి సరితాదేవి
శ్రీ నాయక్ - శ్రీ కామరాజు.

టెక్నీషియన్లు

దర్శకత్వం	...	చంద్రమోహన్
మాటలు, పాటలు	...	శ్రీ రామచంద్
పద్యాలు	....	శ్రీ రామచంద్, శ్రీ కామరాజు శ్రీ చెరువు ఆంజనేయశాస్త్రి.
సంగీతం	....	శ్రీ ఘంటసాల
నృత్యములు	...	శ్రీ యస్. భూపాల్
ఛాయ	....	శ్రీ యస్. కె వరదరాజ్
శబ్దం	....	శ్రీ కె. ఆర్. సీతారామ్
కూర్పు	...	శ్రీ పద్మనాభన్
కళ	...	కోటి, సత్యనారాయణరావు
ప్రోసెసింగ్	...	సీతారామ్
స్టిల్స్		యం. ఆర్. కె. మూర్తి
మేకప్	...	యం యస్, సుబ్బయ్య వీర్రాజు, భద్రయ్య (జూనియర్)
దుస్తులు	...	అచ్యుతం, అప్పారావు, నటేష్ పిళ్ళై
సంయుక్తదర్శకుడు	...	యన్. ఆర్ శర్మ

స్టుడియో: ప్రిమియర్ (మైసూరు) రికార్డింగ్: ఆర్. సి. ఏ.

K. Ravichandran

నేపథ్యగానం :

ఘంటసాల, పి. లీల, జమునారాణి, మాధవపెద్ది సత్యం

నెగటివ్ రైట్స్ :

శ్రీ కృష్ణా పిక్చర్స్, విశాఖపట్నం.

డిస్ట్రిబ్యూటర్లు :

ఆంధ్ర జిల్లాలకు : శ్రీ కృష్ణా పిక్చర్స్,

గాంధీనగరం : : విజయవాడ.